క్లుప్తంగా

నేడు అర్వపల్లికి ఎమ్మెల్యే సామేలు రాక

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగే కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, డీసీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, దరూరి యోగానందచారి తదితరులు హాజరవుతారని పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కి సన్మానం



గోరెంట్లలో సర్పంచ్ దామెర్ల వెంకన్నను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శి మంగ

మద్దిరాల : సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా మండల పరిధిలోని గోరెంట్ల గ్రామ మాజీ సర్పంచ్ దామెర్ల వెంకన్నతోపాటు మాజీ వార్డు సభ్యులను పంచాయతీ కార్యదర్శి మంగ శనివారం సాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, బందు కృష్ణయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డీటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా పాక లింగమల్లు



నాగారం : రాష్ట్రంలో నూతనంగా ఆవిర్భవించిన ఉపాధ్యాయ సంఘం ధర్మ టీచర్స్ యూనిన్ (డీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పాక లింగమల్లుయాదవ్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మల్లాపురం గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాడుతామని అన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తేవడానికి డీటీయూ కృషి చేస్తుందన్నారు. తన ఎన్నికకు సహకరించిన డీటీయూ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కమిటీల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

భానుపురి : సూర్యాపేట పట్టణ టెంటు ఓనర్స్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాపల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా పోలగాని కృష్ణ, పిడమర్తి శంకర్, ప్రధాన కార్యదర్శిగా సహిద్ ఇన్ అబుద్, కోశాధికారిగా ఎం.మురళి, సహాయ కారదర్శిగా సందీప్, గౌరవ సలహాదారులుగా కట్కూరి ప్రేమ్‌సాగర్, కిషోర్ బాబులను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా జీవన్ కుమార్, శేఖర్ రెడ్డి, తాహిర్, రమేష్, తాళ్లపల్లి సైదులు గౌడ్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కమిటీ..



తుంగతుర్తిలో నూతనంగా ఎన్నికైన ఎస్సీసెల్ కమిటీ సభ్యులు

తుంగతుర్తి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తుంగతుర్తి గ్రామ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ తుంగతుర్తి నూతన అధ్యక్షుడిగా బొంకూరి రమేష్, ఉపాధ్యక్షులుగా తడకమళ్ల నాగరాజు, మల్లేపాక నగేష్, ప్రధాన కార్యదర్శులుగా తడకమళ్ల సైదులు, రాంబాబు, కోశాధికారులుగా తడకమళ్ల రమేష్, మరికంటి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా తడకమళ్ల వెంకన్న, సుందర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లుగా బొంకూరి రంజిత్, పోషయ్య, ముఖ్య సలహాదారులుగా చంద్రయ్య, యల్లయ్య, రవి, సుధాకర్, శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తపెట్ల శంకర్, చింతకుంట్ల వెంకన్న, తడకమల్ల పరశురాం, జలేందర్, విఠల్, కిరణ్, నవీన్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బోర్డు బహూకరణ

మద్దిరాల : మండల పరిధిలోని చిన్ననెమిల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన గుజ్జ అనిల్ శనివారం గ్రీన్ బోర్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌బోర్డ్‌ను బహూకరిస్తున్న గుజ్జ అనిల్

అభివృద్ధికి నోచుకోని బౌద్ధక్షేత్రం

- శిథిలావస్థలో ఫణిగిరిలోని బౌద్ధ సంపద
- అభివృద్ధి చేస్తే భారీగా పెరగనున్న పర్యాటకులు



ఫణిగిరి గుట్టపై ఉన్న బౌద్ధస్థూపం

నాగారం : రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన ఫణిగిరి బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. బౌద్ధం హరివిల్లిన ప్రపంచస్థాయి క్షేత్రం ఫణిగిరి. నాగారం మండలం ఫణిగిరి గ్రామానికి సమీపంలో ఏకశిల కొండపై ఉన్న ఈ బౌద్ధ క్షేత్రం ఎంతో ప్రత్యేకమైనది. రాష్ట్ర పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో ఎంతో ప్రాచీనమైన బౌద్ధ సంపద బయల్పడిన ప్రాంతం. కానీ బౌద్ధ క్షేత్రం వద్ద సరైన మౌలిక వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఫణిగిరి కొండపైకి మెట్లు లేకపోవడం, టాయిలెట్స్, నీటి సౌకర్యం లేకపోవడం, పరిసర ప్రాంతం అభివృద్ధి చేయకపోవడంతో ఈ క్షేత్రానికి రావడానికి పర్యాటకులు అవస్థలు పడుతున్నారు. అత్యంత ప్రసిద్ధి గాంచిన ఈ ఫణిగిరి బౌద్ధక్షేత్రానికి చైనా, జర్మనీ, మయన్మార్, భూటాన్, శ్రీలంక, బ్రిటన్ తదితర దేశాలనుంచి విద్యార్థులు, స్కాలర్స్, బౌద్ధ సన్యాసులు, పర్యాటకులు వస్తుంటారు. ఇంతటి ప్రాచుర్యం ఉన్న ఈ బౌద్ధక్షేత్రం వద్ద కనీస మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం.

అమలుకు నోచుకోని హామీలు..

ఫణిగిరి బౌద్ధ క్షేత్రం అమరావతి, నాగార్జునకొండతో సమానమైన బౌద్ధ సంపదను కలిగి ఉంది. ఈ బౌద్ధక్షేత్రం అభివృద్ధి కోసం రూ.3కోట్లతో ప్రణాళికలు రూపొందించామని గతంలో ఉన్న జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఫణిగిరి కొండపై గెస్ట్‌హౌజ్, కొండపైకి మెట్లకోసం కోసం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కానీ వీటిలో ఏ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఫణిగిరి బౌద్ధక్షేత్రానికి వెళ్లడానికి గుట్టపైకి మెట్లు నిర్మించాలని, బౌద్ధ సంపద భద్రపర్చడానికి పక్కాభవనం ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



ఫణిగిరి బౌద్ధ క్షేత్రం ఉన్న కొండ



తాత్కాలిక మ్యూజియంలో ఉన్న బౌద్ధ సంపద

మౌలిక వసతులు కల్పించాలి



ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద మౌలిక వసతులు కల్పించాలి. నిత్యం ఫణిగిరి గుట్టకు దేశ, విదేశాల పర్యాటకులు వచ్చివెళ్తుంటారు. బౌద్ధ క్షేత్రానికి వెళ్లేందుకు సీసీరోడ్డు, గుట్టపైకి మెట్లు, నీటి సౌకర్యం కల్పించాలి. ఎంతో చరిత్ర కలిగిన బౌద్ధ సంపదను పరిరక్షించి, పర్యాటక ప్రాంతంగా మార్చాలి.

– నాతి వీరమల్లు, ఫణిగిరి

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఫణిగిరి బౌద్ధక్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. గుట్ట చుట్టూ ప్రత్యేకమైన కారిడార్ ఏర్పాటు చేసి, సందర్శకులకు వసతి గృహంతో పాటు మౌలిక వసతులు కల్పించాలి. బౌద్ధక్షేత్రం పక్కనే మెగా పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశాం. ఇది పర్యాటకులకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణానికి దోహదపడుతుంది. కనీస వసతులు కల్పిస్తే ఫణిగిరి గొప్ప పర్యాటక ప్రాంతంగా మారుతుంది.

– గట్టు నర్సింహారావు, మాజీ సర్పంచ్, ఫణిగిరి

తెలంగాణకు అన్యాయం జరగనివ్వం

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్ : కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) శ్రీశైలం, నాగార్జునసాగర్ నదీ జలాల నిర్వహణ బాధ్యతలను కేంద్ర జలశక్తి సంఘానికి అప్పగిస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారుతుందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం ఈ విషయాన్ని వ్యతిరేకించిందని తెలిపారు. బచావత్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం తెలంగాణ జలాల వాటా విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా పోరాటం చేయాలన్నారు. ఇప్పటికే నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పొలాలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం కృష్ణా జలాల విషయంలో ఉన్న నిబంధనలను యథాతథంగా ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో పరిజ్ఞానం

నూతనకల్ : విద్యార్థులు క్షేత్రస్థాయిలో వివిధ అంశాలను పరిశీలించడం ద్వారా మరింతగా పరిజ్ఞానం పొందుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడిపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు పలు అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. నూతనకల్‌లో మర మగ్గాలు పనిచేయడం, చిల్పకుంట్లలో మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం పనిచేయు విధానం, మిర్యాలలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ గోపురంపై ఉన్న రామాయణం, మహాభారతం ఇతివృత్తాంతం తదితర అంశాలను చూపించారు. ఆయా అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిల్పకుంట్లలో మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వర్ధెల్లి రాములుకు నివాళి

తుంగతుర్తి : కొత్తగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వర్ధెల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ శనివారం వర్ధెల్లి రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు వర్ధెల్లి శ్రీహరి, వర్ధెల్లి కృష్ణలను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు కొణతం సత్యనారాయణరెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్షుడు గోపగాని సుధాకర్‌గౌడ్, దామల్ల మల్లయ్య, రాజేష్, మారగాని వెంకన్న, స్వామి, శ్రీనివాస్ ఉన్నారు.



రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్

సమరభేరి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ఈ నెల 15వ తేదీన ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించనున్న సమరభేరి కరపత్రాలను శనివారం స్థానిక తిరుమల గ్రాండ్ హోటల్‌లో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజ మల్లయ్య మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ ఉద్యమాలు విస్తృతం చేస్తుందన్నారు. ఈ నెల 15న సూర్యాపేటలో నిర్వహించే సమరభేరి కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు రాముగౌడ్, అన్సారి తదితరులు హాజరవుతారని తెలిపారు. నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సూరారపు పరీక్ష రాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జూలూరి మమత, యువజన విభాగం అధ్యక్షుడు తక్కలపల్లి ప్రశాంత్, నరసింహ, మోదుగు అనూష, తక్కెళ్లపల్లి శ్యాం కుమార్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు కావాలి

అర్వపల్లి : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ దరఖాస్తులకు సంబంధించి సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు ఫారం 18తో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులకు గడువు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో నాయబ్ తహసీల్దార్ కంట్ల మయ్య, సిబ్బంది జలంధర్‌రావు, పాష, కరుణాకర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు..

అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ కొప్రపిడత అవిలయ్య కోరారు. మండల పరిధిలోని పర్సాయపల్లిలో శనివారం తన ఇంటివద్దనే పట్టభద్రులతో సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేయించారు. పట్టభద్రులు తప్పనిసరిగా ఈనెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పట్టభద్రులు, తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : పట్టభద్రులతో ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేయిస్తున్న మాజీ జెడ్పీటీసీ అవిలయ్య

నాగారం : ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు గంట మహేందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఓటు హక్కు కలిగి ఉన్న వారు కూడా మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు 6వ తేదీ చివరి గడువు అని తెలిపారు. ఆయనతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

వైన్స్ ఎదుట హమాలీల నిరసన



వైన్స్ ఎదుట నిరసన తెలుపుతున్న హమాలీలు

ఆత్మకూర్(ఎస్) : మద్యం, పత్తి కాటన్లు దించే హమాలీల కూలి రేట్లు పెంచాలని హమాలీ సంఘం అధ్యక్షుడు మోరపాక శేషయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని నెమ్మికల్లు వైన్స్ ఎదుట మందు కాటన్లు దింపకుండా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో ప్రతి కాటనుకు రూ.5.50 ఇస్తుండగా నెమ్మికల్లులో కేవలం రూ.4.50 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఇక్కడ కూడా రూ.5.50 ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా శ్రమ దోపిడీకి గురవుతున్నామని, అధికారులు స్పందించి తమకు హమాలీ రేట్లు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీలు మడ్డి నాగరాజు, బత్తుల రవి, సోమ్లానాయక్, షేక్ సైదులు, జె.సత్తయ్య, వెంకన్న, పాల్గుణ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 9వ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ పరీక్షలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి 36 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ లెవల్‌కు అర్హత సాధించారు. 5వ తరగతి నుంచి ఇద్దరు, 6వ తరగతి నుంచి 10 మంది, 7వ తరగతి నుంచి 11 మంది, 8వ తరగతి నుంచి ముగ్గురు, 9వ తరగతి నుంచి తొమ్మిది మంది, 10వ తరగతి నుంచి ఒకరు అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

11, 12 తేదీల్లో మహాసభలు

నడిగూడెం : ఖమ్మంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం కోరారు. శనివారం నడిగూడెం మండలంలోని తెల్లబల్లి ఉన్నత పాఠశాలలో మహాసభల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మోతె : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం టీఎస్ సీపీఎస్‌ఈయూ టేబుల్ క్యాలెండర్‌ను తహసీల్దార్ ప్రకాష్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజయ్, సుధాకర్, ఉపేందర్, నాగయ్య, వెంకటేశ్వర్లు, రూపాదేవి, సామ్రాజ్యం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి



దురాజ్‌పల్లి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



పెన్‌పహాడ్ : ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మె నోటీస్ ఇస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో పారిశ్రామిక సమ్మె –గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ధ్వంసం చేస్తూ కార్పొరేట్లకు అమ్మేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుంటి మురళి, హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు ఒగ్గు వెంకన్న, హరి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

బంద్ నోటీస్ అందజేత

పెన్‌పహాడ్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతన చట్టాలను అమలు చేయకుండా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ రణపంగ కృష్ణ, మట్టయ్య, నర్సయ్య, నరేష్, ఎల్లమ్మ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనాలి..

ఆత్మకూర్(ఎస్) : ఈ నెల 16న జరిగే సమ్మెలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొనాలని సీఐటీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యం.రాంబాబు కోరా రు. శనివారం మండల పరిధిలోని నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడికి సమ్మె నోటీసు ఇచ్చి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను కార్మికులుగా గుర్తించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న, మండలి వీరన్న, మారపాక ముత్తయ్య, కోడూరి మల్లయ్య, జలగం భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై రైతు సంఘం నిరసన



నూతనకల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని విస్మరించారని ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కందాల శంకర్ రెడ్డి మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా కేంద్రం వ్యవసాయ బడ్జెట్‌ను రూపొందించిందని ఆయన ఆరోపించారు. 2024–25 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.2లక్షల 22వేల 281కోట్లు కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ వాస్తవంగా కేటాయించింది రూ. లక్ష 17వేల 528కోట్లు మాత్రమే అని ఆయన తెలిపారు. దేశంలో రైతులకు కావాల్సిన సంక్షేమ పథకాలు, పంటల బీమా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సత్యం, కూసు సైదులు, పులసరి వెంకటముత్యం, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, మున్నా నాగమల్లు, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద బాలశిక్ష పుస్తకాలు అందజేత

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెండెం కృష్ణ అందజేసిన పెద్ద బాల శిక్ష పుస్తకాలను ఫణిగిరి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం.నారాయణ శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పెద్ద బాల శిక్ష పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాతలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.రేణుక, పి.నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీజ, ఉమ, రమేష్, హేమమాలిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందజేస్తున్న నారాయణ

రూ.5వేల పింఛన్ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బాబు

తిరుమలగిరి : ప్రభుత్వం డప్పు, చెప్పు కార్మికులకు రూ.5 వేల పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చింత బాబు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరిలో మాట్లాడారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు మాదిగలంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లేటి లక్ష్మణ్, కొమ్ము సోమన్న, జానయ్య, సురేష్, మధు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు దేశగాని చెన్నమల్లు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. దీంతో చెన్నమల్లు మృతదేహాన్ని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల కమిటీ సభ్యుడు శిగ వెంకన్న, సంపతి వెంకన్న, నిమ్మనగోటి అబ్బులు, ఎల్లంల అవి లయ్య, వజ్జె వినయ్, శిగ శ్రీనివాస్, భిక్షం, వీరస్వామి తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు మధూకర్

అర్వపల్లి : వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పకుండా పాటించాలని అర్వపల్లి ఎస్ఐ ఇందనూరి మహేందర్‌నాథ్ కోరారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు క్రాసింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ అండ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేష్, రాజ, సురేష్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌పై పరిజ్ఞానం పెంచుకోవాలి

మునగాల : ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అందె సత్యం అన్నారు. శనివారం మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్ బాబు మాట్లాడారు. మన ఆలోచనలు పర్యావరణ పరిరక్షణ కోసం ఉండాలని, మూఢ నమ్మకాలపై దృష్టి పెట్టవద్దన్నారు. ఎమ్మెస్ విద్యా సంస్థల అధినేత పందిరి నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియంలో కోదాడ మండలం ద్వారకుంట జెడ్పీహెచ్ఎస్, ఇంగ్లిష్ మీడియంలో టీఎస్ఆర్ఎస్ తుంగతుర్తి బాయ్స్ పాఠశాల, ప్రైవేటు స్కూల్స్ నుంచి సూర్యాపేటలోని అంజలి స్కూల్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలిపారు. తొలుత స్థానిక ఎంపీపీ బిందు జెండా ఆవిష్కరించారు.